ప్రజాశక్తి

గురువారం 15 ఫిబ్రవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జలజీవన్ పనులపై దుమారం

- ఇళ్ల పట్టాల్లో అక్రమాలపై మండిపాటు
- జెడ్‌పి సమావేశంలో సభ్యులు ధ్వజం
- తాగునీటి సరఫరా సరిగా లేదని ఛైర్‌పర్సన్ సుభద్ర అసంతృప్తి
- వైద్య సేవలు మెరుగుపర్చాలి : సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

సమస్యలను లేవనెత్తుతున్న సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

జల జీవన్ మిషన్ (జెజెఎం) నిధులతో చేపట్టిన తాగునీటి సరఫరా పనులు నిరుపయోగంగా ఉన్నాయని పలువురు జెడ్‌పిటిసిలు ధ్వజమెత్తారు. పనులు జరిగిన గ్రామాల్లో నీరు సరిగా ప్రజలకు ఇవ్వలేని పరిస్థితి ఉందని అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జెడ్‌పి ఛైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జలజీవన్ మిషన్ పనులపై చర్చ వాడివేడిగా సాగింది. ఏజెన్సీ, మైదాన ప్రాంతంలో జెజెఎం నిధులతో చేపట్టిన మంచినీటి పథకాలెక్కడా సరిగా పనిచేయడంలేదని ఛైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. పనులు సక్రమంగా జరగలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏజెన్సీలో ఎంతోకాలం కిందట ఏర్పాటు చేసిన గ్రావెటీ వాటర్ స్కీం పనిచేసినట్లు కొత్తగా నిర్మించిన జెజెఎం మంచినీటి పథకాలు పనిచేయడంలేదన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో నీరు రావడంలేదని జెడ్‌పిటిసి బాలయ్య పోతురాజు, బోర్లకు హెడ్స్ బిగించలేదని హుకుంపేట జెడ్‌పిటిసి మత్స్య లింగం, కుళాయిలకు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని రాంబిల్లి జెడ్‌పిటిసి ధూలి నాగరాజు అన్నారు. సోలార్ వాటర్ స్కీం పనులు మరమ్మతులకు గురయ్యాయని గొలుగొండ జెడ్‌పిటిసి సుర్ల వెంకటగిరిబాబు తెలిపారు

పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల్లో అనేక అక్రమాలు జరిగాయని బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి దొండా రాంబాబు అన్నారు. అక్రమాలు, పట్టాల అమ్మకాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు పొందిన అనర్హుల జాబితా అధికారులకు సమర్పించినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని గొలుగొండ జెడ్‌పిటిసి వెంకటగిరిబాబు తెలిపారు. ఇళ్ల పట్టాల అక్రమాలపై చర్యలు తీసుకోవడంలో అధికారుల అశ్రద్ధపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధాన మివ్వడంలేదంటూ గృహ నిర్మాణ సంస్థ పీడీ మిగతా 2లో..

సభ్యులను వారిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, అధికారులు

విశాఖ నగరంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం

విశాఖలో బైకు ర్యాలీ ◆ పలుచోట్ల పోస్టర్ల ఆవిష్కరణలు, సమావేశాలు

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాలు విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. సమ్మెకు సన్నాహకంగా కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ, పంపిణీ, బైక్ ర్యాలీలు, సమావేశాలతో కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలను సమాయత్తం చేస్తున్నాయి. విశాఖ నగరంలో బుధవారం భారీ బైకు ర్యాలీ చేపట్టారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పాల్గొన్నారు.

వార్తలు మెయిన్, టాబ్లాయిడ్‌లో...

రాజధానిపై మాటమార్పు వెనుక రెచ్చగొట్టే కుట్ర

వార్త 2లో..

కాగడాలు, డోలీలతో గిరిజనులు వినూత్న నిరసన

వార్త 2లో..

మోడీ తొత్తులతో పోరాటం : కెఎ.పాల్

వార్త 2లో..

కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరిక

వార్త 2లో..

ఎయులో రూ.5 కోట్లతో..

ఆహార పరీక్ష ప్రయోగశాల ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :

ఆంధ్రా యూనివర్సిటీ కెమెస్ట్రీ విభాగంలో రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన ఆహార పరీక్ష, ప్రమాణీకరణ ప్రయోగశాలను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసన మండలి సభ్యులు వరుదు కల్యాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో జరిగిన ఒప్పందాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు వ్యవసాయ ఉత్పత్తి కేంద్రాల ప్రారంభోత్సవంతో పాటు వివిధ పరిశ్రమలకు శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమానికి తాడేపల్లి నుంచి రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నెల్లూరు నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రోసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి వర్చువల్‌గా హాజరై ప్రారంభించారు. విశాఖ జిల్లాలో ఎపిఎఫ్‌పిఎస్

ఎయులో ఆహార పరీక్ష ప్రయోగశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

(ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ) నిధులు రూ.5 కోట్లతో ఆరు వేల అడుగుల విస్తీర్ణంలో ఎయు కెమిస్ట్రీ విభాగంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రోసెసింగ్ అండ్ స్టాండర్డైజేషన్ లేబొరేటరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రయోగశాలను శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జలజీవన్ పనులపై దుమారం

రమామణి తీరును తప్పుబట్టారు. సభ్యుల ఆవేదన అర్థంచేసుకోకుండా పీడీ మాట్లాడ్డం సరికాదని పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు అన్నారు. పరవాడ మండలంలో కొండల నుంచి చెరువులకు వచ్చే ఛానల్స్ ఆక్రమణలను తొలగించాలని కోరారు.

సమస్యలపై గళమెత్తిన గంగరాజు

అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి డి.గంగరాజు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సంపూర్ణంగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోగులను ఎస్.కోట నుంచి విజయనగరం కాకుండా, విశాఖపట్నం తరలించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటల పిహెచ్‌సిల్లో వైద్యులు వుండేలా చూడాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయని తెలిపారు. సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా మార్చడంతో పాటు, ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయడానికి వైద్యులు, సిబ్బంది డబ్బులు వసూలుచేస్తున్నారని మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ తెలిపారు. మండలంలో అందరికీ కళ్లద్దాలు అందలేదని పరవాడ జెడ్‌పిటిసి సన్యాసిరాజు అన్నారు. ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం 21 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా పరిషత్ సిఇఒ పోలినాయుడు, అనకాపల్లి డిఆర్‌ఒ దయానిధి, వివిధ శాఖాధికారులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

కోరంలేక ఆలస్యం

జిల్లా పరిషత్ సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరుకాకపోవడంతో కోరంలేక ఆలస్యంగా ప్రారంభించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభంకావాల్సిన సమావేశం, కోరంలేక 11.12 గంటల వరకు జరగలేదు. ఈలోపు సిఇఒ పోలినాయుడు 15వ ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్న పనుల వివరాలు తెలిపారు. సమావేశానికి ముందు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర పూలమాలవేసి నివాళులర్పించారు. సిఇఒ పోలినాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, అధికారులు పాల్గొన్నారు.

ఆహార పరీక్ష ప్రయోగశాల ప్రారంభం

కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఆహార నాణ్యత పరీక్ష సౌకర్యాన్ని అందించే అత్యాధునిక ప్రయోగశాల ఇదని ఎయు వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి మంత్రులకు వివరించారు. విద్యా, వాణిజ్య ప్రయోజనాల కోసం ఈ ప్రయోగశాల ఉపయోగించబడుతుందని తెలిపారు. కల్తీ సరుకులతో ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఈ ప్రయోగశాల ద్వారా సరుకుల నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు ఎపిఎఫ్‌పిఎస్ రూ.5 కోట్లు, జిల్లా కలెక్టర్ రూ.2 కోట్లు సిఎస్ఆర్ నిధులను మంజూరు చేస్తున్నట్లు మంత్రులకు వివరించారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ వై.రాజేంద్రప్రసాద్, ఆర్ అండ్ డి డీన్ ప్రొఫెసర్ కె.బసవయ్య, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విద్యాశాఖ డివైఇఒను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : జివిఎంసి విద్యాశాఖలో అనధికారికంగా కొనసాగుతున్న డివైఇఒ డి.శ్రీనివాస్‌ను తక్షణం రిలీవ్ చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి జివిఎంసి పరిధిలో ఉండే ఉపాధ్యాయులు అందరూ జిఒ 84 ప్రకారం పాఠశాల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కిందకు వచ్చి ఉండటంతో సదరు డివైఇఒగా పనిచేస్తున్న శ్రీనివాస్ గత సంవత్సరం నుంచి ఏ పనీ లేకుండా ఇక్కడ కొనసాగుతున్నారన్నారు. ఇదే విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి తగు చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, నాయకులు రాజు నాయుడు, ఉపాధ్యాయులు అక్కునాయుడు, అర్జున్ పాల్గొన్నారు.

తెలుగుదండు పాలికేక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెలుగు భాషకు రక్షణ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, తదితర డిమాండ్లతో రానున్న ఎన్నికల్లో విశాఖపట్నం లోక్ సభ స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలుగు దండు వ్యవస్థాపక అధ్యక్షులు పరవస్తు ఫణిశయన సూరి తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగు దండు పాలికేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలుగు భాష రక్షణ కోసం ఈ నెల 16న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 24 గంటల పాటు ఉపవాస దీక్షను చేపడతామన్నారు

కాగడాలు, డోలీలతో గిరిజనులు వినూత్న నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు నియోజవర్గం అనంతగిరి మండలంలో పలు గిరిజన గ్రామాలలో రోడ్లు, తాగునీరు, కరెంటు సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న హాలు బయట ఆకులు ధరించి, కాగడాలు, డోలీలతో వినూత్న నిరసన తెలిపారు. పాలకులారా ఎన్నాళ్ళ మాకు డోలీమోతలు, రోడ్లు, మంచినీరు, కరెంటు సమస్యలను పరిష్కరించ లేరా ? అంటూ నినాదాలు చేశారు. దీంతో మహారాణిపేట పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఈ రోజు జరిగిన జిల్లా పరిషత్ సమావేశానికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ హాజరు కాలేదని, మీ సమస్యను ఆ జిల్లా కలెక్టర్‌కు నివేదించి, పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు మీడియాతో మాట్లాడుతూ అనంతగిరి మండలంలోని పెదకోట, పినకోట, కివర్ల పంచాయతీల పరిధిలోని 12 గ్రామాలు రోడ్డు సౌకర్యం లేక దశాబ్దాల కాలంగా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాలకులకు ఎన్ని పర్యాయాలు చెప్పినప్పటికీ ఫలితం లేకపోవడంతో గిరిజనుల సహకారంతో శ్రమదానంతో సుమారు 13 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. ఇంకా అనేక రోడ్లు నిర్మించవలసి ఉందన్నారు. తాగునీరు లేక చెరువులు, చెలమల నీరు తాగుతూ గిరిజనులు నిత్యం రోగాల బారిన పడుతున్నారని, పలువురు మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా పాలకులు గుర్తించి ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే స్థానిక రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై గిరిజనుల భూములను గిరిజనేతరులకు వెబ్ ల్యాండ్ రికార్డుల్లో నమోదు చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల గిరిజనుల భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యను జిల్లా రెవెన్యూ అధికారులు సీరియస్‌గా తీసుకొని అందుకు బాధ్యులైన మండల స్థాయిలోని రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

డోలీ మోతలతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

మోడీ తొత్తులతో పోరాటం : కెఎ.పాల్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని మోడీ తొత్తులతో తాను పోరాటం చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ అన్నారు. ఆయన దక్షిణ నియోజకవర్గ పరిధిలోని రైల్వే న్యూ కాలనీలోగల పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి బొత్సకు తెలుగులో మాట్లాడం రాదుగానీ లక్ష కోట్లు దోచుకోవడం వచ్చునని ఎద్దేవా చేశారు. జగన్ తన తల్లిని, చెల్లిని మోసం చేశారన్నారు. షర్మిల 16 నెలల పాదయాత్రతోనే జగన్ అధికారం పొందారన్నారు. పిసిసి అధ్యక్ష పదవి తీసుకున్న షర్మిల టిడిపి విజయానికి దోహదం చేస్తున్నారన్నారు. తాను ప్రతి నెలా 50 వేల మంది మహిళలకు ఆర్థిక సాయం చేస్తున్నానన్నారు. విశాఖలో భూములు, కొండలను నేతలు దోచుకున్నారని మండిపడ్డారు. తాను స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటానని, నాలుగు వేల కోట్ల నిధులు తెస్తానని అన్నారు.

ప్రభుత్వ తీరుపై నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దశల వారీ ఆందోళనలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి జెఎసి జిల్లా ఛైర్మన్ వై.నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఎపి జెఎసి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ముందుగా ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులంతా వివిధ నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీవోస్ హోమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 16న పాఠశాలల వద్ద నిరసన ప్రదర్శనలు ఉంటాయన్నారు. 17న ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామన్నారు. 20న కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని వెల్లడించారు. 21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు జిల్లాల పర్యటనలు నిర్వహిస్తారని తెలిపారు. 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మెకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి విశాఖ జిల్లా కన్వీనర్ ఆర్.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పలువురు ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడి, తహసీల్దార్ టి గోవింద్‌కు ఉద్యోగ జెఎసి ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ భీమిలి తాలూకా యూనిట్ సహాధ్యక్షులు ఎం లోవరాజు, కార్యదర్శి కె సాయిబాబా, జిల్లా కౌన్సిలర్ వి అప్పలరాజు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు టి భీమారావు, కార్యదర్శి ఎం.ఆనందరావు, విశ్రాంత ఉద్యోగి కె ముత్యాలరావు పాల్గొన్నారు.

రాజధానిపై మాటమార్పు వెనుక కుట్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇప్పటి వరకూ మూడు రాజధానులు అంటూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాట పాడారని, నాలుగో రాజధానిగా హైదరాబాద్ అని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పేర్కొనడం వెనుక రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ప్రజల్ని రెచ్చగొట్టే కుట్ర దాగి ఉందని టిడిపి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆరోపించారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టులో అమరావతి రాజధాని అని ఈ ప్రభుత్వం కౌంటర్ ఇచ్చిందని, కేంద్ర ప్రభుత్వం కూడా స్పష్టం చేయడంతో పాటు మ్యాప్‌లో అమరావతి రాజధాని అని ధ్రువీకరించారని అన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
O.S. 310/2023

Between:
Gujji Bhavani ...Plaintiff
And:
Bandaru Lokesh and others ...Defendants

To,
D2: Bandaru Babji,
S/o Ramakrishna, aged about 43 years, residing at D.No.12-247, Anna Nagar, Arilova, Visakhapatnam-40.

Whereas the above named plaintiff filed the above suit against you and other defendants for permanent injunction amongst other reliefs and you are hereby directed to appear before the above mentioned court on **22-04-2024 by 10:30 A.M.** failing which the matter will be heard and decided you ex-parte.

(By order of the court)
Sri. P. Venkateswara Rao,
Sri. B.A. Raju,
Sri. A. Sharad Kumar,
Advocates,
Bheemunipatnam.

మహారాజశ్రీ భీమునిపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP 38/2023 O.S.378/2019

మధ్య :
వెన్ని అప్పారావు ...DHR / వాది
మరియు :
వెన్ని త్రినాధరావు ... JDR / ప్రతివాది

వేలం నోటీసు

ఇందు మూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయనది ఏమనగా ఈ దిగువ తెల్పిన షెడ్యూలు ఆస్థిని శ్రీ కోర్టు వారు **తే.11-03-2024దిన ఉదయము 10.30 గంటల నుంచి సాయంత్రము 5.00 గంటలు** లోపు బహిరంగముగా వేలం జరిపించబడును కావలసిన వారు పాటలో పాల్గొన వచ్చును

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, పద్మనాభం మండలము పాండ్రంగి రెవిన్యూ గ్రామములో ఉన్న ఎ.00.98 1/2 సెంట్లు సర్వే నెం.385/2 బరు, ఖాతా నెం.2015 బరు, పల్లం భూమికి హద్దులు.
East: కొమ్మూరి సంజీవరావు వగైరాలు పల్లం భూమి
South : పల్లంటి వెంకటరావు పల్లం భూమి
West : వెన్నివెంకట సన్యాశిరావు పల్లం భూమి
North : నీరుపారే కాలువ

కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము

పోలిశెట్టి వెంకటేశ్వరరావు
బి.ఎ.రాజు, ఎ.శరద్‌కుమార్
న్యాయవాదులు, భీమునిపట్నం
సెల్ : 9849695844
భీమునిపట్నం
14.02.2024

మహారాజశ్రీ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 64 / 2022

Between:
Bubbili Apparao ... వాది
And:
Gadi Seshagiri rao and others ... ప్రతివాదులు

To
D-1: Gadi Seshagirirao, S/o. Musalayya R/o. D.No. 32-22-12/2, Atchayyammapeta, Allipuram, Visakhapatnam.
D-2: Gadi Srinivasu, S/o. Musalayya R/o. D.No. 32-22-12/2, Atchayyammapeta, Allipuram, Visakhapatnam.

దావా పరిహారం నిమిత్తం (ప్లెయింటు కాపీ జతపరచడమైనది) మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2024వ సం॥ మార్చి నెల 05వ తారీఖున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరిఅయిన భోగట్టా యివ్వబడిన వకీలు గారి ద్వారాగా లేక సరిఅయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందు వల్ల మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజుల న్నింటినీ నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆరోజు హాజరుపర్చుటకు మీకు ఉత్తరువు చేయడమైనది.

పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పినయెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించుట మగునని మీరు తెలుసుకోవలసినది.

N.SRIRAM MURTHY,
Advocate for Plaintiff
Kothavalasa, Cell : 8498819579

ఇళ్ల స్థలాలకు పేదల భూపోరాటం

రెండోరోజున సిపిఎం ఆధ్వర్యాన ఆటస్థలం చదును చేసిన పేదలు

ప్రజాశక్తి- పెందుర్తి : పేదల ఇళ్లస్థలాల కోసం పెందుర్తి కార్మికనగర్‌లో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో రెండో రోజు భూపోరాటాన్ని కొనసాగించారు. మంగళవారం సుమారు 100 మంది పేదలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని పాకలు వేయగా, బుధవారం అక్కడ ఆటస్థలానికి కొంత భూమిని చదును చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు బి..జగన్ మాట్లాడుతూ, పేదలకు ఇళ్లస్థలాలను ఇవ్వాలని పెందుర్తి తహశీల్దార్‌ను మరోమారు కలిసి విన్నవించామన్నారు. 2019నుంచి అధికారులు, నేతలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, ఇళ్లస్థలాలకు భూమిని కేటాయించాలని పదేపదే మొరపెట్టుకుంటున్నా, కనీస స్పందన లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పేదలంతా ప్రత్యక్ష కార్యాచరణకు దిగి, ఎర్రజెండాలను స్థలాన్ని ఆక్రమించుకుని పాకలు వేశారని, ఇపుడు అక్కడ కాలనీవాసుల పిల్లల ఆటస్థలానికి కొంత భూమిని చదును చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికార యంత్రాంగం, నేతలు స్పందించాలని, పేదల ఆవాసానికి ఆక్రమించిన స్థలాల్లో

సిపిఎం ఆధ్వర్యంలో ఆటస్థలం చదును చేస్తున్న పేదలు

పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. చినముషిడివాడ జంక్షన్‌లో 95వ వార్డు కార్పొరేటర్ విలువైన వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమిస్తే దానివైపు కన్నెత్తి చూడని అధికారులు, పేదల ఆవాసానికి అరవై గజాల చోటులో పాకవేస్తే ఆగమేఘాల మీద వచ్చి కూల్చేస్తున్న వివక్షపూరిత చర్యలు దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ సభ్యులు శంకరరావు అప్పలనాయుడు, విజయమ్మ, వాసు ఈశ్వరరావు, అన్నపూర్ణ, లక్ష్మీ, మహేష్, రాజు పాల్గొన్నారు

గెడ్డ అభివృద్ధికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపి ఎంవివి

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డులో రూ.2.45కోట్ల జివిఎంసి నిధులతో ఆరిలోవ కాలనీ, లక్ష్మీనగర్, కనకమహాలక్ష్మీ నగర్ గుండా పోయే గెడ్డల ఆధునికీకరణ పనులకు బుధవారం వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో వైసిపి తూర్పు సమన్వయకర్త, ఎంపి ఎంవివి.సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. జివిఎంసి ఎఇఇ వెంకటరావు, భరత్, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్య నారాయణ, బేతా దుర్గారావు, సత్యాల వెంకట్ పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు బకాయి చెల్లించాలని పలు కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కాకాస కార్యాలయంలో కాకాస, చిట్టివలస లేబర్ యూనియన్, టిఎన్‌టియుసి జ్యూట్ నాయకులు పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. కార్మికుల బకాయి చెల్లించకుండా ఇక్కడున్న భూములను అమ్మేందుకు యాజమాన్యం యత్నిస్తే అడ్డుకుంటామని ఆయా సంఘాల నాయకులు యాజమాన్యాన్ని హెచ్చరించారు. కోర్టు పరిధిలో పలు కేసులు ఉన్నందున భూముల అమ్మకాలు చట్ట విరుద్ధమన్నారు. జెవి కైలాస్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, ఎంవి గురుమూర్తి, ఎన్ రామారావు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా వైసిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించినట్లు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా విని, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలకు సంబంధించి వినతులు, అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

శారదాపీఠంలో వసంత పంచమి వేడుకలు

ప్రజాశక్తి- పెందుర్తి : విశాఖ శారదాపీఠంలో బుధవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. 987 మంది బాల బాలికలకు సామూహిక అక్షరాబ్యాసాలు నిర్వహించగా, సరస్వతీ పూజల్లో 840 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పీఠంలోని రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పరీక్షల సమయం కావడంతో అమ్మవారి పాదాల చెంత పుస్తకాలు, పెన్నులను ఉంచి విద్యార్థులు పూజలు చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎన్‌టిఆర్ సేవాసమితి, గీతం హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12వ వార్డు, టివిసి పాయింట్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గీతం వైద్యుల పర్యవేక్షణలో అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని, ఆరిలోవ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భీమిలి మండలం, సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజుపేట, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం కళాకారులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

పిఇటి పోస్టులు లేకపోవడం అన్యాయం

సందీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు.

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పిఇటి పోస్టులు లేకపోవడం అన్యాయమనిపలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ బుధవారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో జనసేన నియోజకవర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్‌కు వినతి పత్రం అందజేశారు. 2024 డిఎస్‌సి నోటిఫికేషన్‌లో యుజిడి, పిఇటి, డిపిఇడి పూర్తి చేసిన వారికి దరఖాస్తు పెట్టేందుకు అర్హత లేకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ప్రభుత్వ విధానాలతో కొన్ని వేల కుటుంబాలు రోడ్డునపడ్డాయని వాపోయారు. పిఇటి పోస్టులను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం వివక్ష ధోరణితో నోటిఫికేషన్ జారీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సందీప్ స్పందిస్తూ, సమస్యను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జనసేన నాయకులు శాఖరి శ్రీను బాబు, నందిక రోహిత్ రెడ్డి పాల్గొన్నారు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -ఆనందపురం: గుండె సమస్యతో బాధపడుతున్న ఆనందపురం మండలం చందక పంచాయతీకి చెందిన దొంతల లక్షణ వైద్యసాయానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.రెండు లక్షల చెక్‌ను బుధవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. లక్షణ అనారోగ్య సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి దృష్టికి స్థానిక సర్పంచ్ బంక శ్రీను తీసుకురాగా, ఆయన సిఫార్సు మేరకు సిఎం సహాయనిధి నుంచి సాయం మంజూరైంది.కార్యక్రమంలో సర్పంచ్ బంక శ్రీను, మాజీ సర్పంచ్ గుసిడి వెంకటరమణ, పిఎసిఎస్ డైరెక్టర్ లోలుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు



బాధితునికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మాస్టర్ రిసోర్స్‌పర్సన్స్‌కు అభినందన

ప్రజాశక్తి- ములగాడ : రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో గుంటూరు కెఎల్. యూనివర్సిటీలో ఈనెల 12,13వ తేదీల్లో అభ్యసనాభివృద్ధిపై మాస్టర్ రిసోర్స్‌పర్సన్స్ శిక్షణలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌సిసి జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవిలను బుధవారం కళాశాల యాజమాన్యం అభినందించింది.

అలాగే పంజాబ్, రాజపురాలోని చిత్కార యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న ఎన్‌సిసి వాలంటీర్ జి.హర్షితారాణిని కూడా అభినందించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, వచ్చే నెలలోవివిధ ప్రభుత్వ పాఠశాలల్లో వాలంటీర్లతో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, సిస్టర్ జయశీల, జానిస్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో వినియోగదారుల హక్కులు, తదితర అంశాలపై బుధవారం వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు జిల్లా వినియోగదారుల సంఘం సభ్యులు రహీ మున్నీసా బేగం మాట్లాడుతూ వైద్యరంగంలో ప్రతికూల పరిస్థితులపై చర్చించారు. కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి శాస్త్రి పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : అనారోగ్య కారణాలతో గీతం విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఆరిలోవ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాలివి.

కడప జిల్లా గోపవరం మండలం బద్వేలు గ్రామానికి చెందిన గోనుగుంట ఇస్మాయిల్(19) గీతం యూనివర్సిటీలో బిటెక్ మొదటి ఏడాది(సిఎస్ఇ) చదువుతున్నాడు. గీతంలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ హాస్టల్‌లో ఉంటున్నాడు. హాస్టల్ రూంలో ఇస్మాయిల్, మరో విద్యార్థి కలిసి కొన్నాళ్లుండేవాడు. ఇటీవలే ఆ విద్యార్థి వేరే గదికి మారిపోయాడు. దీంతో కొద్ది రోజులుగా ఇస్మాయిల్ ఒక్కడే ఆ రూంలో ఉంటున్నాడు. ఇస్మాయిల్ పదేళ్లుగా థైరాయిడ్‌తో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి 10 గంటలకు హాస్టల్ గదిలో లోపలు గడియ పెట్టి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎప్పటిలాగానే రాత్రి 11 గంటలకు హాస్టల్ సిబ్బంది గదిని తనిఖీ చేసే సమయంలో ఇస్మాయిల్ రూం తలుపులు తెరిచి లేవు. దీనితో అనుమానం వచ్చిన సిబ్బంది కిటికీ తలుపులు తెరిచి చూడగా ఇస్మాయిల్ అపస్మారక స్థితిలో కింద పడి ఉండం,. పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడాన్ని గమనించారు. తలుపులు బద్దలు కొట్టి గీతం ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరిలోవ పోలీసుల ద్వారా ఇస్మాయిల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లి హజరత్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసారు.

ఘనంగా తల్లిదండ్రులకు పాద పూజోత్సవం

తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఆరిలోవ : వాలంటైన్స్ డేను పురస్కరించుకొని ఆరిలోవ భారతీ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిదండ్రుల పాద పూజోత్సవాన్ని నిర్వహించారు. శరత్‌చంద్ర ప్రభు ఆధ్వర్యంలో విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి, పూజించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు భావోద్రేకానికి గురయ్యారు. ఆనందం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా స్కూలు డైరెక్టర్ ఎంవి.రావు మాట్లాడుతూ, నేటి సమాజంలో పెద్దలు, గురువులు, తల్లిదండ్రుల పట్ల పిల్లల్లో గౌరవభావం క్షీణిస్తున్న నేపథ్యంలో పెద్దల పట్ల పూజ్యభావం పెంపొందించాలనే లక్ష్యంతో ఇటువంటి

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

ప్రజాశక్తి -పద్మనాభం : అనంత పద్మనాభుని క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపి జివిఎల్ నరసింహారావు అన్నారు. బుధవారం అనంతపద్మనాభుని దర్శించుకుని పూజలు చేశారు. పద్మనాభంలోని యుద్ధ స్థలాన్ని, రెండవ విజయరామరాజు సమాధిని విగ్రహాన్ని సందర్శించి ఘనంగా నివాళిలు అర్పించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, గత ప్రభుత్వాల హయాంలో నిరాదరణకు గురైన అనంత పద్మనాభ క్షేత్రం అభివృద్ధికి నిధులు మంజూరుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల్ ఆధ్వర్యంలో విశాఖ పోర్ట్ ఆడిటోరియంలో ఈ నెల 15న విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన 13 వైద్యశిబిరాల్లో గుర్తించిన మూడు వేలమంది వికలాంగులకు ఉచిత ఉపకరణాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, బొడ్డు రవికుమార్, ఆర్ శ్రీను, బొడ్డు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న జియ్యాని

ప్రజాశక్తి- వేపగుంట : చినముషిడివాడలోని వేంకటేశ్వర స్వామిని గ్రేటర్ విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీధర్ దంపతులకు స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసారు.అనంతరం ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించబోయే రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేత అప్పారావు

ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న అప్పారావు

ప్రజాశక్తి -గాజువాక : గోవాలో సూపర్ మాస్టర్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వహించిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విశాఖ ఉక్కు ఉద్యోగి ఆండిబోయిన అప్పారావు బంగారు పతకాన్ని సాధించాడు. ఈనెల 8 నుంచి 13వరకు గోవా జిఎంసి బంబోలియన్ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచి,. 2024 ఇండియన్ ఛాంపియన్‌షిప్ సాధించారు. 18 రాష్ట్రాల నుండి పాల్గొన్న పవర్‌లిఫ్టర్లను ఢీకొని, మాస్టర్-2 కేటగిరీ, 93కిలోల బాడీ వెయిట్‌లో విభాగంలో విజేతగా నిలిచారు. విజేత ఆండిబోయిన అప్పారావుకు నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ తరపున సురేష్ సెల్వ బంగారు పతకాన్ని, సర్టిఫికెట్‌ను బహూకరించారు. జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేత అప్పారావుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

నాసా పోటీలకు రవీంద్రభారతి విద్యార్థులు

నాసా పోటీలకు సిద్ధమౌతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వెల్లంకి రవీంద్రభారతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు నాసా పోటీలకు సన్నద్ధమవుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఉమా మహేష్ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ దక్షిణ భారతావనిలోనే ప్రప్రథమంగా 2009లో నాసాతో మొదలైన రవీంద్ర భారతి విద్యా సంస్థల ప్రస్థానం 15ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. ప్రణాళిక రచన, విధి విధానాలు, క్రమశిక్షణ ఆయుధాలుగా ఏటా నాసా పోటీల్లో రవీంద్రభారతి విద్యాసంస్థల విద్యార్థులు విజయ దుందుభి మోగిస్తున్నారన్నారు. ఈ ఏడాది మే 23 నుంచి 26వరకు లాస్ ఏంజెల్స్, కాలిఫోర్నియాలో నిర్వహించే నాసా అంతర్జాతీయ సమ్మేళనానికి ఈక్వినాక్స్, ఫోనిక్స్, నోవా టెర్రజో ప్రాజెక్టులతో సంసిద్ధులౌతున్నారని ప్రిన్సిపల్ ఉమా మహేష్ తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

వైసిపి ముఖ్యనేతలతో సమీక్షిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధిలోని సమస్యలు, అభివృద్ధి పనులపై బుధవారం కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వైసిపి ముఖ్యనేతలతో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు సమీక్షించారు. ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రహదారుల విస్తరణ, సామాజిక భవనాల నిర్మాణం, కొండవాలుప్రాంతాల్లో రక్షణగోడలు, డ్రైనేజీలు, ఓటర్ల జాబితా పరిశీలన తదితర అంశాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబెర్ కంటిపాము కామేశ్వరి, చల్ల రజని ఈశ్వరరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ళ లీలావతి శ్రీనివాస్, ఉషశ్రీ, వి.ప్రసాద్,రేయ్యి వెంకటరమణ, బర్కత్ ఆలీ, కెవిఎన్ శశికళ, వార్డ అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, మండల అధ్యక్షులు జివి రమణి, కృష్ణారావు, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు బులుసు జగదీష్, అమర్ రెడ్డి, వసంతల అప్పారావు, సీనియర్ నాయకులు కిరణ్‌రాజు, రాయడు శ్రీను, రత్నాకర్, నూకరాజు,ఐ.రవికుమార్, సురేష్,రమేష్, బొడ్డేటి కిరణ్, పి.సునీత, హరిపట్నాయక్, జక్కంపూడి సత్యనారాయణ, గురువోజీ పాల్గొన్నారు.

16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ జయప్రదానికి

వాడవాడలా విస్తృత ప్రచారం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్టీల్ సిఐటియు నేతలు

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాలు విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. సమ్మెకు సన్నాహకంగా కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ, పంపిణీ, బైక్ ర్యాలీలు, సమావేశాలతో కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలను సమాయత్తం చేస్తున్నాయి. నిరసన నినాదాలతో ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నాయి.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ఉక్కునగరం : పోరాటాలపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. బుధవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ప్లాంట్ లోని స్టోర్ జంక్షన్ వద్ద సమ్మె ప్రాధాన్యతను వివరిస్తూ ప్రచురించిన స్టీల్ వర్కర్ మాసపత్రికను విడుదల చేశారు.

ఈ సందర్భంగా జె అయోధ్యరామ్ మాట్లాడుతూ కార్మిక, కర్షక మైత్రిని ప్రతిబింబించేలా సమ్మె ద్వారా ప్రభుత్వ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ సమస్యలపై కార్మికులతో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వానికి ఐదేళ్ళు సరిపోలేదాయని ఎద్దేవా చేశారు. స్టీల్ సిఐటియు ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, కష్ణమూర్తి, బి మహేష్, శ్రీనివాసరెడ్డి, డి సత్యనారాయణ, దుర్గాప్రసాద్, విడివి పూర్ణచంద్రఃరావు, మధు, మురళి, కార్యదర్శి వి ప్రసాద్ పాల్గొన్నారు.

గాజువాక : 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గాజువాక సిఐటియు కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పెద్దసంఖ్యలో జివిఎంసి, ఇతర రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎ.లోకేష్, జిల్లా కమిటీ సభ్యులు రాంబాబు, గాజువాక జోన్ నాయకులు కె.కిరీటం, ఎం ఇమాన్యుయేల్, జి రాము పాల్గొన్నారు.

భెల్ మెయిన్ గేట్ వద్ద నిరసన..

గాజువాక: 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భెల్ మెయిన్‌గేట్ వద్ద బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటివి ప్రకాష్ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షులు బి.బాబూరావు, ఇంటక్ ప్రధాన కార్యదర్శి బాబూరావు, పివిఎన్.రాజు, వి. ఆనంద రావు, కొల్లి దేవుడు, ఎస్.జగన్నాధరావు పాల్గొన్నారు.

ములగాడ : ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలు ప్రయివేటీకరణ వంటి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగాఈనెల 16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని షిప్‌యార్డ్ కార్మికులకు అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. షిప్‌యార్డ్‌కు వచ్చిన 5 ఎఫ్ఎస్ఎస్ వర్క్ ఆర్డర్స్‌లో కొన్నింటిని ప్రయివేటుకు ఇవ్వజూపడం, 30ఏళ్లు పైబడిన ఎల్అండ్ఎం సిరీస్ కార్మికుల రెగ్యులరైజేషన్, అర్హులైన స్టాఫ్ అండ్ వర్క్‌మెన్‌కు ప్రమోషన్ కల్పన, భోజన అలవెన్స్ రివిజన్, సొసైటీ, కాంట్రాక్టు కార్మికుల్లో చాలామందికి రెగ్యులర్‌గా వేతనాలు అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని షిప్‌యార్డ్ అఖిలపక్ష కార్మిక సంఘాలు వైఎస్ఆర్‌టియుసి, టిఎన్‌టియుసి, సిఐటియు, టిఎన్ఇటియు, జిఎస్‌టియుసి, హెచ్ఎంఎస్ యూనియన్లు పిలుపునిచ్చాయి. సమ్మె జయప్రదానికి సన్నాహంగా 14,15 తేదీలలో షిప్‌యార్డ్ గేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

షిప్‌యార్డు గేటు వద్ద నిరనస నినాదాలు చేస్తున్న కార్మికులు

అనకాపల్లి :కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జరుగు దేశవ్యాపిత గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఏఐటియుసి, రైతు సంఘం, రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ నుండి రింగ్ రోడ్డు జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, రైతు కూలీ సంఘం కన్వీనర్ అజయ్ కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ అప్పలరాజు, సంతోష్, పి.చలపతి, ఆర్ దొరబాబు, కే శంకర్రావు, గణేషు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అచ్చుతాపురం : భారత్ గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గ్రామాలలో బుధవారం సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం చేశారు. ముఠా కార్మికలను కలిసి బంద్‌లో పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓ సన్యాసిరావు, డి నాయుడు, కె మహాలక్ష్మి నాయుడు, కే సన్నాసిరావు, సిహెచ్ సన్యాసిరావు, ఎన్ చిన్నారావు, డి అప్పారావు, పి నూక అప్పారావు, ఏ అప్పారావు, కే అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరిగే పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పరవాడ ఫార్మాసిటీలో విజయశ్రీ పరిశ్రమ నుండి ఐఓసి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె అప్పలరాజు, ఎం ముసలి నాయుడు, జి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : దేశ వ్యాప్త గ్రామీణ భారత బంద్‌ను జయప్రదం చేయాలని చోడవరంలో రైతు సంఘం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, సూరిశెట్టి జాన్, నారాయణరావు, రంగనాథం, శ్రీను పాల్గొన్నారు.

విశాఖలో పోస్టర్ల ఆవిష్కరణలో ఆటో యూనియన్ నేతలు

విశాఖలో బైక్ ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : సమ్మె జయప్రదం కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి సిఐటియు, ఎఐటియుసి, ఎపిఎఫ్‌టియు సంఘాల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం రైతులకు, కార్మికులకు నష్టదాయకమైన చట్టాలను చేసిందన్నారు. ఈ నెల 16న జరిగే సమ్మెను దచీశీఅవగజయప్రదం చేయాలని కోరారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. 16న సరస్వతీ పార్క్ నుంచి జరుగుతున్న కార్మిక ప్రదర్శనలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బైకు ర్యాలీ జివిఎంసి గాంధీవిగ్రహం నుంచి జగదాంబ, లేపాక్షి, చౌట్రీ, పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు మీదుగా అల్లిపురం, డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తిరిగి జివిఎంసి వద్దకు చేరుకుంది. సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం. శ్రీనివాసరావు, ఎఐటియుసి అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, ప్రజా, కార్మిక సంఘాల నేతలు పి.మణి, ఉరు కూటి రాజు, వి.కృష్ణారావు, ఎస్‌కె.రెహ్మాన్, పడాల రమణ, వై.రాజు, బి.వెంకటరావు, కె.చంద్రశేఖర్, యుఎస్ఎన్. రాజు, టి.నూకరాజు, కె.కుమారి పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోటారు ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు మాట్లాడారు. విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో మైక్ ద్వారా విస్తృత ప్రచారం

గాజువాకలో పోస్టర్ల ఆవిష్కరణ

పరవాడలో ప్రచారం చేస్తున్న కార్మిక సంఘం నేతలు

చోడవరంలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

విద్యార్థి మృతికి కారణమైన నారాయణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా

నారాయణ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న మచ్చుకర్ల వంశీ అనే విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మృతుని కుటుంబ సభ్యులతో నారాయణ కాలేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ, ఎస్.రమణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ మాట్లాడుతూ నారాయణ కాలేజీలో ఇంటర్ మొదట సంవత్సరం చదువుతున్న మచ్చుకర్ల వంశీని ఈనెల 12న కళాశాలలో అధ్యాపకులు కొట్టడం, దుర్భాషలాడారని తెలిపారు. దీంతో తీవ్ర మనోవ్యథకు గురైన వంశీ బుచ్చియ్యపేట చిట్టయ్య పాలెం గ్రామంలోని తన ఇంటికి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. కళాశాలలో జరిగిన సంఘటన యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయలేదని పేర్కొన్నారు. సంఘటన జరిగి రెండు రోజులు అవుతున్నా ఆర్ఐఓ, జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వచ్చి న్యాయం చేస్తామని చెబుతూనే ఎటువంటి న్యాయం బాధితులకు చేయకుండా వెళ్ళిపోయారన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఆ కళాశాల పర్మిషన్ రద్దు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ, నాయకులు ప్రవీణ్, కార్తీక్, సింహాద్రి, రమేష్, హేమంత్, లక్ష్మణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యాన్ని అధికారులను నిలదీస్తున్న దృశ్యం

సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

కరాటేలో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : విశాఖ వేదిరాయ కరాటే కన్యకా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐదు స్వర్ణాలు, రెండు వెండి, 3 కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ రూప నంద, ఆకాడెమిక్ ఇన్‌చార్జీ సిహెచ్ చంద్ర మౌళి, కరాటే కోచ్ సూరి అప్పారావు అభినందించారు.

ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలు

ప్రజాశక్తి -అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలందరికీ నాణ్యమైన వైద్య సేవలను ఇంటి వద్దకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి పేర్కొన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో 4వ సచివాలయం ఉడ్‌పేట పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యమ్మ మాట్లాడుతూ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, నాయకులు డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, జివిఎంసి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, వైసిపి నాయకులు జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, డాక్టర్ లక్ష్మీ నారాయణ, పలక సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు జర్నలిస్టుల క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ జర్నలిస్టు స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో విశాఖ ఫార్మాసిటీ క్రీడామైదానంలో ఈనెల 15, 16 తేదీల్లో అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు ఆహ్వానపు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సాయంత్రం రాంకీ కమర్షియల్ హబ్ ఆవరణలో రాంకీ డీజీఎం గిరిధర్ భక్షి సమక్షంలో ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే టీములకు సంబంధించి డ్రా తీశారు. రాంకీ ఫార్మసిటీ స్పాన్సరింగ్ జట్లు పిజెఎస్ డబ్ల్యుఎ సభ్యులకు ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ పోటీల్లో మొత్తం 7 క్రికెట్ బృందాలు పాల్గొంటున్నాయని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులతో పాటు ప్రతి మ్యాచ్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వ్యక్తిగత బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు రాజేశ్వరి, శ్రీనివాసరెడ్డి, పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర టీముల కెప్టెన్లు పాల్గొన్నారు.

అప్పలనాయుడును అభినందిస్తున్న దృశ్యం

పిఎసిఎస్ అధ్యక్షునిగా అప్పలనాయుడు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా జాగారపు అప్పలనాయుడు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. బంగారమ్మ పాలెం గ్రామానికి చెందిన గండి సన్యాసిరావు అనారోగ్యంతో అకాలంగా మృతి చెందడంతో సంఘ అధ్యక్ష పదవి ఖాళీ అయింది. ఆ స్థానంలో అదే గ్రామానికి చెందిన అప్పలనాయుడును నియమించారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగిరెడ్డి నాగేశ్వరరావు వైసీపీ నాయకులు కోట్ని శివ, పెయ్యిల అప్పారావు, మజ్జి రమణ పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : జివిఎంసి జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడును ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నేతలు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తే అభినందిస్తామని, నిర్లక్ష్యం వహిస్తే నిలదీస్తామని, అనకాపల్లి అభివృద్ధికి ప్రజాసంఘాల ఐక్యవేదిక తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, ముగడా అప్పారావు, ముమ్మన అప్పారావు, దొక్కురి మోహన్ కుమార్ యాదవ్, దొక్కురి జయవీర్ యాదవ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ పేర ప్రజలతో ఆట

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇన్నాళ్లు మూడు రాజధానుల పేర మూడుముక్కలాట ఆడిన వైసిపి నాయకులు నేడు హైదరాబాద్‌ను మరో రెండేళ్ల రాజధానిగా పొడిగించాలని చెబుతూ ప్రజలతో ఆట ప్రజలతో ఆడుకుంటున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉండాలని వైసిపి నేత వైవి సుబ్బారెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని, పదవీకాలం పూర్తవుతున్న తరుణంలో రాజధాని గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్ రెడ్డికి ఏమాత్రం లేదని తెలిపారు. హైదరాబాదులో ఉన్న బినామీ భూములను కాపాడుకోవడానికి సుబ్బారెడ్డి ప్రయత్నిస్తున్నారని జగదీష్ ఆరోపించారు. విజయ్ సాయి రెడ్డి వైవీ సుబ్బారెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో ఇప్పటికే బినామీ పేర్లతో ఇక్కడి భూములు కాజేశారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ధనాల విష్ణు చౌదరి, విల్లూరి రమణబాబు, బోడి వెంకటరావు, కొమ్మర్తి నారాయణ పాల్గొన్నారు.

వరల్డ్ నేషనల్ ఫోరం మీట్‌కు బాలు గాడి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 16 నుండి 21వ తేదీ వరకు నేపాల్‌లోని ఖాట్మాండ్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ సోషల్ ఫోరమ్‌కు అనకాపల్లి నివాసి బాలు గాడికి ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం పలు ప్రజాసంఘాల నాయకులు బాలు గాడిని అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా 130 దేశాలకు చెందిన ప్రతినిధులు ఇందులో పాల్గొని ఆయా దేశాల్లో సామాజిక మార్పు, సామాజిక అభివృద్ధి కోసం అభిప్రాయాలు పంచుకుంటారు. ఇందులో అనకాపల్లి జిల్లా వెనుకబడిన బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన గాడి బాలు వ్యవసాయ కూలీలు స్థితిగతులు, ప్రభుత్వ విధానాలు, ఆదివాసీలు, విస్థాపన, వలస కూలీల కొరకు నూతన విధానాల అన్వేషణ అనే అంశాలపై మాట్లాడే అవకాశం ఇచ్చారు. బాలును అభినందించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరయాదవ్, ఏఐవైఎఫ్ నాయకులు దొక్కరి హరీష్ తదితరులు ఉన్నారు.

అగ్రి గోల్డ్ బాధితుల గృహ నిర్బంధం అన్యాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఈ నెల 15న విజయవాడలో జరిగే అగ్రిగోల్డ్ బాధితుల పోరాట దీక్షకు వెళ్లకుండా అగ్రిగోల్డ్ బాధితులను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేయడాన్ని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 రోజుల్లోగా 20 వేల రూపాయల లోపు, ఆరు నెలల లోపల మొత్తం డిపాజిట్ దారులందరికీ సొమ్ము తిరిగి చెల్లిస్తామని నమ్మబలికి ఐదేళ్ళ కావస్తున్న ఒక రూపాయి కూడా చెల్లించి పోవడం అన్యాయమన్నారు. బాధితులు ప్రభుత్వం సొమ్ము ఏమి అడగలేదని అగ్రిగోల్డ్ ఆస్తులు స్వాధీనం చేసుకుని డిపాజిట్లు చెల్లించాలని కోరారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి మోసం చేయడం వల్ల అగ్రిగోల్డ్ బాధితుల ఆత్మహత్యలకు, బలవన్మరణాలకు పాల్పడే అవకాశం ఉందని, ఇవి ప్రభుత్వ హత్యలు గానే పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించారు.

సూర్యనారాయణస్వామికి పీలా పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి -అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామం రాజుపాలెం శ్రీసూర్యనారాయణ స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా బుధవారం మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు అయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివిలో ఘనంగా వార్షికోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ శివారు బేతపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కళాశాల విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అదరగొట్టారు. ప్రత్యేక అధికారి సిహెచ్ భవన మాధురి ఆధ్వర్యంలో దేవరాపల్లికి చెందిన రంధి వెంకటరావు సమకూర్చిన పరీక్ష మెటీరియల్‌ను పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారులు బి పడాల్ దాస్, ఉషారాణి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి రమణ, కొరుప్రోలు శ్రీను చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

నినాదాలు చేస్తున్న ఆర్ఎఆర్ఎస్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆర్ఏఆర్ఎస్‌లు, ఏఆర్ఎస్‌లు, కెవికెలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు ఈనెల 16వ తేదీలోపు పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 15 సంవత్సరాల నుండి కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 16వ తేదీలోపు సమస్యలు పరిష్కారం కాకపోతే ఆ తరువాత ఎప్పుడైనా రాష్ట్ర వ్యాపితంగా నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. జాతీయ పండుగ సెలవులు (వేతనంతో కూడిన) కాంట్రాక్టు లేబర్ అందరికీ అమలు చేయాలని, కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రెండు లక్షలు, ప్రమాద మరణానికి రూ.ఐదు లక్షలు పరిహారం చెల్లించేందుకు జారీ చేసిన జిఒను వర్తింపజేయాలని కోరారు. పని ప్రదేశంలో కార్మికులు పాముకాటు, ఇతర ప్రమాదాలకు గురి అయినప్పుడు రీసెర్చ్ స్టేషన్ అధికారులు బాధ్యత తీసుకొని వైద్యం చేయించాలని, యూనివర్సిటీ పరిధిలో ఖాళీ ఉద్యోగాల భర్తీలో కాంట్రాక్టు లేబర్‌కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. శంకరరావు, కొణతాల నందేశ్వరరావు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు ఇస్తున్న దృశ్యం

'థింక్ బిగ్ గ్లోబల్'తో గొన్న కళాశాల ఎంఒయు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఏడుమెట్ల మర్రిపాలెం వద్దనున్న గొన్న కళాశాల థింక్ బిగ్ గ్లోబల్‌తో ఎంఓయు కుదుర్చుకుంది. థింక్ బిగ్ గ్లోబల్ సంస్థ వారు విద్యార్థులకు ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గురించి పూర్తి అవగాహన కల్పించడానికి సెమినార్ ఇచ్చారు. ఈ సెమినార్లో విద్యార్థులు అంతర్జాతీయ విద్య భవిష్యత్తుకు ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలిపారు. థింక్ బిగ్ గ్లోబల్, గొన్న కళాశాలతో చేసుకున్న వప్పందం ప్రకారం గొన్న కళాశాలలో స్టూడెంట్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వంటి సేవలు నిర్వహించనుంది. ఈ సందర్భంగా గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెంచంద్ నాయుడు మాట్లాడుతూ ఈ ఒప్పందం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధ్యాయుల వృత్తి అభివద్ధికి దోహదపడుతుందని చెప్పారు.

గ్రామాల్లో భరత్ కుమార్ పర్యటన

ప్రజాశక్తి- కశింకోట : వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కసింకోట మండలంలోని అచ్చెర్ల, బయ్యవరం, వెదురుపర్తి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సచివాలయాలను పరిశీలించారు. అక్కడ సమస్యల అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆచ్చర్ల వైఎస్సార్ పార్టీ కార్యకర్తలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ దాడి శ్రీను, మిస్కా రమణ, నిమ్మదల నాగేశ్వరరావు, గోవింద పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక బైపాస్ రోడ్డుకు ఆనుకొని వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టనున్న స్థలంలో బోరు ఏర్పాటుకు బుధవారం నిర్వాహకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి సుధారాణి, మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఉపసర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, పొలిమేర కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, జల్లేపల్లి కృష్ణ, సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో శివుని విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నల్లరేగులపాలెం గ్రామ శ్మశానంలో శివుని విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు పెతకంశెట్టి రామకృష్ణ తన తండ్రి పెతకంశెట్టి చిన్నమునాయుడు జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని స్మశానంలో ఏర్పాటు చేశారు. సర్పంచ్ పెతకంశెట్టి లక్ష్మి రామకోటి అప్పారావు దంపతులు ఈ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో రామకృష్ణ స్వగృహం వద్ద ఆయన తండ్రి చిన్నమునాయుడు పెద్దకర్మ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఆడారి నరేంద్ర, అనకాపల్లి పార్లమెంట్ వాణిజ్య విభాగ కార్యదర్శి ఆడారి నాగరాజు, పి. శేషు, దొడ్డి శ్రీనివాసరావు, కాకర పెంటారావు పాల్గొన్నారు.

తారు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన తార రోడ్డును స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామాలకు అనుసంధానమయ్యే లింక్ రోడ్లన్నీ దాదాపుగా పూర్తి కావస్తున్నాయని తెలిపారు. చోడవరం మెయిన్ రోడ్డు పట్టణంలో సిమెంటు రోడ్డు నిర్మాణం మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి శ్రీనివాసరాజు, సీరం రెడ్డి వెంకటరమణ, దొడ్డి ప్రసాదు, సేనాపతి శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్ర ప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంజీవయ్య దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఎఐసిసి అధ్యక్షులుగా రెండుసార్లు పనిచేయడమే కాకుండా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర మంత్రిగా కూడా విశిష్ట సేవలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిడి అజయ్ బాబు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, డిఎల్‌డిఓ ఉదయశ్రీ, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ వరబాబు, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..

దామోదరం సంజీవయ్య సంయుక్త మద్రాసు రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు 6 లక్షల ఎకరాలను పంచి పెట్టిన ఘనత వహించారని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సంజీవయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, డిటిసి డిఎస్పీ డి.రామవర్మ, ఏఓ బి.శారద, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఎస్సైలు ప్రసాద్, వెంకన్న, రామారావు, నాగ కార్తీక్, సావిత్రి, దివ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లా వర్సిటీలో..

సబ్బవరం : మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వావిద్యాలయంలో దామోదరం సంజీవయ్య 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్సిటీ సీనియర్ అధ్యాపకులు ఆచార్య నాగేశ్వరరావు, డాక్టర్ నిర్మలదేవి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య జీవితం ఎందరికో ఆదర్శ ప్రాయమైనదని, అయన లోని పట్టుదల, క్రమశిక్షణ ఆయనను ఉన్నత శిఖరాలను చేరుకునేలా చేసిందని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న న్యాయ కళాశాల అధ్యాపకులు

చెరుకు లోడింగ్ ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద చెరుకు లోడింగ్ చేసే కూలీలకు సొమ్మును చెల్లించలేకపోవడంతో చెరుకు లోడింగ్ నిలిపివేసిన ఘటనపై ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన వార్తకు ప్రజాప్రతినిధులు, ఫ్యాక్టరీ మేనేజింగ్ సిబ్బంది స్పందించారు. లోడింగ్ చార్జీలు చెల్లించడంతో బుధవారం యధావిధిగా చెరుకు రవాణాకు మార్గం సుగమనమైంది. 40 రోజులుగా బుచ్చయ్యపేట చెరుకు కాటా నుండి లారీలకు చెరుకు లోడింగ్ చేసిన కూలీలకు సంబంధిత కాంట్రాక్టర్ లోడింగ్ చేసిన ఛార్జీలు కూలీలకు చెల్లించలేదు. దీంతో కూలీలు మంగళవారం చెరుకు లోడింగ్ నిలిపివేశారు. దీనిపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు జడ్పిటిసి సభ్యుడు దొండ రాంబాబు స్పందించి బుధవారం ఉదయమే చెరుకు కాటా సందర్శించి ఫ్యాక్టరీ ఎండి సన్యాసినాయుడు, సిడిఓ తదితర అధికారులతో ఫోన్లో మాట్లాడి రైతులు ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కూలీలకు చెల్లించాల్సిన రూ.2.60 లక్షలు చెల్లించారు. తమ కూలీ నగదు చెల్లించడంతో బుధవారం మధ్యాహ్నం నుండి లోడింగ్ పనులను ప్రారంభించారు.

చెరుకు లోడ్ చేస్తున్న కూలీలు

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది యాదవ వీధిలో నూతనంగా నిర్మాణం అవుతున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి మండల యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సింగంపల్లి రమేష్ రూ.50వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగంపల్లి రమేష్

ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని సింగన్న దొరపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇంచార్జ్ పివిజి కుమార్, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రూ.10వేలు విరాళం అందించారు. అనంతరం గుడి ఆవరణలో ఆలయ నిర్వహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్లే గ్రామంలో శ్రీసీతారాముల తీర్థ మహెూత్సవానికి పైలా ప్రసాదరావు హాజరై స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పూడి నారాయణమూర్తి, వెలగల పైడం నాయుడు, మాజీ ఎంపీటీసీ పిల్లల రమణ, జామి రమణేశ్వరరావు, పిల్లల దేవుడి బాబు, పిల్లల మహాలక్ష్మి, బండారు నరసింహనాయుడు, గోకాడ ఝాన్సీ పాల్గొన్నారు.

సీతారాముల ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం గ్రామంలో శ్రీసీతారాముల ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు రవి శర్మ, శ్రీను ఆధ్వర్యంలో పూజ నిర్వహించి ఉదయం 8.29 గంటలకు శ్రీసీతారాముల ఆలయ, విగ్రహ, శిఖర ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు.మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, స్థానిక సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, టిడిపి, మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కె.కోటపాడు జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ, వైసిపి నాయకులు కిలపర్తి భాస్కరరావు, బూరె బాబూరావుపాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -అచ్చుతాపురం : పోస్టాఫీసు ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పొదుపు పథకాలను, ఇన్సూరెన్స్ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని అనకాపల్లి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ వివి సత్యనారాయణ అన్నారు. పొదుపు ఖాతాలు అత్యధిక సంఖ్యలో చేయించడంలో భాగంగా బుధవారం ఆయన కాజీపాలెం, తిమ్మరాజుపేట, హరిపాలెం, పెదపాడు తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లను సందర్శించారు. కొంతమంది ప్రజలతో ఆయన మాట్లాడి పథకాల గురించి వివరించారు. గ్రామీణ తపాలా జీవిత బీమా పథకం, ప్రమాద బీమా పథకాలు, సేవింగ్స్, రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, కాల పరిమితి కూడిన పొదుపు పథకాలపై ప్రచారం చేయాలని బిపిఎంలకు ఆయన సూచనలు చేశారు.

గోవాడ సుగర్స్‌లో లక్ష టన్నుల క్రషింగ్

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఇప్పటి వరకు లక్ష టన్నులు చెరుకు క్రషింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్‌డి వి.సన్యాసినాయుడు బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జనవరి ఒకటో తేదీ నుండి క్రషింగ్ ప్రారంభించమని, ఈ 40 రోజుల్లో లక్ష టన్నుల గానుగాట చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు తక్కువగా ఉన్నందువలన రెండు లక్షల టన్నులు క్రషింగ్ జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మరో రెండు మూడు రోజుల్లో చెరుకు సరఫరా చేసిన రైతులకు 15 రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు.

దిశ చట్టం, రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మహిళ సమాఖ్య కార్యాలయంలో బుధవారం జరిగిన విఓఎల సమావేశంలో దిశ చట్టం, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కశింకోట మహిళా ఎఎస్ఐ రమణి మాట్లాడారు. ముందుగా రోడ్డు భద్రతపై జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ వి.ధర్మారావు, ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీలు సత్యనారాయణ, శ్రీను, రామకృష్ణ, అనురాధ, పాల్గొన్నారు.

చెరుకు రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ధర్నా

ప్రజాశక్తి- మునగపాక

చెరకు పండించే రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఏపీ రైతు సంఘం, గ్రామ రైతు సంఘం, అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చెరకు రైతులకు 9 గంటల విద్యుత్‌ను నిరంతరంగా అందజేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో గల చెరకు రైతులకు ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరాతో చెరకు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. చెరకు క్రసింగ్ సీజన్ కావడం మూలంగా బెల్లం తయారీకి విఘాతం కలుగుతుందన్నారు. గతం మాదిరిగా ఉదయం 6 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేపట్టి బైఠాయించారు. ఏఈ గోపి ధర్నా కార్యక్రమానికి చేరుకొని రైతులతో చర్చలు జరిపి 9 గంటలకు విద్యుత్ సరఫరా అందజేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో తెలుగు రైతు కార్యదర్శి దాడి ముసలి నాయుడు, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, టిడిపి మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం నాయకులు ఎస్ బ్రహ్మాజీ, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, ముల్లేటి సత్యనారాయణ, ఆడారి జానకి, ఆడారి లక్ష్మణరావు, విల్లూరి నరసింగ రావు, సూరిబాబు మల్ల శేషు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

జెడ్.కొత్తపట్నంలో సమస్యలు కోకొల్లలు

- రోడ్డుపైనే మురుగునీరు
-శిథిలావస్థలో డ్రెయినేజీలు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం జెడ్. కొత్త పట్నం గ్రామంలో గత కొన్నాళ్ళు గా పలు సమస్యలు కొలువు తీరి ఉన్నాయి. అధికార పార్టీ కి చెందిన నాయకుల మధ్య ఏర్పడిన వైరం కారణంగా గ్రామం లో అభివృద్ధి పనులు సాగడం లేదనే విమర్శలు స్థానిక ప్రజల నుంచి వినపడుతున్నాయి. గ్రామంలో పారి శుధ్య నిర్వహణ, తాగునీరు, మురుగు నీటి కాలవులు నిర్మాణం వంటి మౌళిక సదుపాయాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సుమారు 10 వార్డుల్లో 1400లకు పైగా ఓటర్లు ఉండగా సుమారు నాలుగు వేల జనాభా కలిగి ఉన్నారు. గ్రామంలో గతంలోనే సిసి రోడ్లు నిర్మాణం చేపట్టగా ఇంత వరకూ ఎక్కడా మురుగు నీటి కాలవులు (సిసి డ్రైన్లు) నిర్మాణం చేపట్ట లేదు. దీంతో మురుగు నీరు రోడ్లు పైనే ప్రవహిస్తోంది. గ్రామస్తులు రాత్రి వేళలలో రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఎక్కడా చూసినా మురుగు నీరు రోడ్డు పై పారుతోంది. స్థానిక ఎస్సి కాలనీలో గతంలో నిర్మించిన మురుగు నీటి కాలవులు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు నిర్వహణ లోపంతో తీవ్ర దుర్గంధం వెదజల్లు తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారి శుధ్య నిర్వహణకు కేవలం ఇద్దరు కార్మికులు మాత్రమే ఉండటంతో ఈ సమస్య తీవ్ర తరంగా ఉందని, పర్యవేక్షణ చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపించారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అంగన్వాడీ కేంద్రాల్లో సమస్య లు

గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు ఉండగా స్థానిక ఎస్సి కాలనీ సమీపంలో 2వ అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. భవనం లోపల భాగంలో గచ్చు భాగం కిందకు దిగి పోయి శిథిలమైంది. ఆరు ఏళ్ళ కిందట నిర్మించిన ఈ భవనం అతి కొద్ది కాలంలోనే కుంగి పోయి బీటలు వారింది. మరో 1వ అంగన్వాడీ కేంద్రం ప్రస్తుతం స్థానిక మండల ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతోంది. కొత్త భవనం నిర్మాణ పనులు పూర్తి కాక పోవడంతో అంగన్వాడీ కేంద్రం తరలించ లేదు.

అంగన్‌వాడీ కేంద్రం

రోడ్డు సమీపాన చెత్తాచెదారం

పరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభం దుర్మార్గం : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపిఐఐసి సేకరించిన భూములలో స్టార్టప్ ఏరియాకు కేటాయించిన భూములలో పరిశ్రమలు ఏర్పాటుకు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా అనకాపల్లి లో బుధవారం అధికారులు శంఖుస్థాపన చేయడం అత్యంత దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు.భూములు కోల్పోయిన రైతులకు, కూలీలకు, దళితులకు, మత్స్యకారులకు పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించకుండానే అనకాపల్లిలో జిల్లా కలెక్టర్, ఏపిఐఐసి అధికారులు శంఖుస్థాపన చేశారంటే నిర్వాశితులను ఎంత మోసం చేస్తున్నారో అర్థం అవుతుందన్నారు. మండలంలో నెలకొల్పే పరిశ్రమలకు అనకాపల్లి లో శంఖుస్థాపన చేయడం చూస్తుంటే నక్కపల్లి ప్రాంతంలో రైతాంగాన్ని, కూలీలను, దళితులను, మత్స్యకారులను మోసం చేయడమే అవుతుందన్నారు.పరిశ్రమలు నెలకొల్పడం ఎంత ముఖ్యమో ఇక్కడ భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వడం కూడా అంతే ముఖ్యమన్నారు. అధికారులు ఒక వైపు సమస్యలు పరిష్కారం చేస్తామని గ్రామ సభలు జరిపి, వినతి పత్రాలు తీసుకుంటున్న నేపథ్యంలో శంఖుస్థాపన చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు.నిర్వాసితులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాలని కోరారు. నిర్వాసితుల సమస్యలను పక్కనపెట్టి శంఖుస్థాపనలు చేసి నిర్వాశితులను రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: ఓటు అనేది వజ్రాయుధమని ప్రతి ఒక్కరు ఓటు విలువ గుర్తెరిగి సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని అధికారులు సూచించారు. పందూరు శివారు గిరిజన గ్రామమైన అల్లుమియ్యా పాలెంలో తహసిల్దారు వెంకటరమణ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావులు గ్రామస్తులకు బుధవారంఓటు విలువపై అవగాహన కల్పించారు. తాత్కాలిక ప్రయోజనాలను ఆశించకుండా ఓటును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వుర్లవరావు, గ్రామ రెవెన్యూ అధికారి ఆషా, బూత్ లెవెల్ అధికారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

వేమగిరిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి ఎస్.రాయవరం: మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి వేమగిరి గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌లో భాగంగా వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశామని డాక్టర్ ఎస్ ఎస్ వి శక్తి ప్రియ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ రీ సర్వే ఈనెల 17 02 వరకు జరుగుతుందని తెలిపారు. లెప్రసి రీసర్వేకు వచ్చిన ఆరోగ్య సిబ్బంది కి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఎస్ ఎస్వి ప్రకాష్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు పి.ఎస్.వి.ఎస్.ప్రసాద్, స్థానిక సచివాలయం హెల్త్ సెక్రటరీ కె.విజయ, గ్రామ సచివాలయం వాలంటీర్స్, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న దాత

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ

ప్రజాశక్తి-మాకవరపాలెం :మండలంలోని జంగాలపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసానికి మండల విద్యాశాఖాధి కారులు పి.జాన్ ప్రసాద్, పిఎస్ఎన్.మూర్తి హాజరయ్యారు. ఈ విద్యార్థులకు గ్రామానికి చెందిన అల్లు సత్యనారాయణ కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ పాఠశాలకు దాతల సహకారం అందించడం అభినందనీ యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే సిఎం జగన్ ధ్యేయం

-ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి-మాకవరపాలెం:మహిళల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. బుధవారం మాకవరపాలెంలో వైయస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కుల పంపిణీ చేపట్టారు. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీకే పొదుపు మహిళలకు రుణాలు అందజేసి లక్షాధికారులను చేయాలనుకుంటే అదే స్ఫూర్తితో ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరింత తోడ్పాటు అందించాలనే ఉద్దేశ్యంతో వైయస్సార్ ఆసరా, వైయస్సార్ చేయూత, సున్నా వడ్డీ, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఇళ్ళ పట్టాలు వంటి పథకాలను అమలు చేశారన్నారు. నియోజకవర్గంలో ఆసరా పథకంలో 55,947 మంది మహిళలకు రూ.159 కోట్లు నేరుగా వారి ఖాతా చేశారన్నారు. మండలంలో 13597 మంది డ్వాక్రా మహిళలకు రూ.9.26 కోట్లు లబ్ది చేకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, మండల వైసిపి అధ్యక్షులు రుత్తల వాసు, తూర్పు కాపు సంఘం మండలాధ్యక్షులు గొంతిన హరిబాబు, భద్రాచలం, ఎంపీడీఒ జాన్ లింకన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాట్లాడుతున్న ఎంపిడిఒ, వైస్ ఎంపిపి

మస్తర్‌లో తేడా లేకుండా చూడాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:కూలీల మస్తర్‌లో ఎటువంటి తేడాలు లేకుండా చూడాలని ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నానాజీ సూచించారు. నక్కపల్లి లో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పనులు గుర్తించి వేతన దారులకు పని కల్పించాలన్నారు. రోజు వేతనం రూ.272 వచ్చే విధంగా చూడాలన్నారు.పనిచేసే ప్రాంతం వద్ద వేసవిని దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో భాగ్య లత శ్రీ , ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు

ఢిల్లీలో రైతులపై దాడి అమానుషం

ప్రజాశక్తి -నక్కపల్లి:పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సంబంధించిన రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధర, రుణ మాఫీ, భీమా అమలు చేసి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ నిరసన తెలిపేందుకు ఢిల్లీకి చేరుకున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం ప్రయోగించిన నిర్బంధాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మండలంలోని బుచ్చిరాజుపేటలో బుధవారం ఆయన రైతులతో కలిసి అప్పలరాజు మాట్లాడారు శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ఢిల్లీకి వెళ్తున్న రైతులను అడ్డుకునేందుకు రోడ్ల పైన ఇనుప మేకులు ఏర్పాటు చేయడం, కందకాలు తవ్వడం, సిమెంట్ దిమ్మలు పెట్టి రైతులను అడ్డుకునే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. రైతాంగం పై లాఠీఛార్జీ, భాష్ప వాయు ప్రయోగించడం వంటి నిర్బంధ చర్యలకు దిగడం కేంద్ర ప్రభుత్వం యొక్క రైతు వ్యతిరేక స్వభావాన్ని వెల్లడి చేస్తున్నదని,రైతులపై నిర్బంధం ప్రయోగించడం మాని రైతు ప్రతినిధులతో చర్చలు జరిపి రైతుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న ఎస్ కేయం, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రాజేష్, వై.సత్తిబాబు, వై.బాబూరావు,కె.కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలరాజు

ఈశ్వర్‌కు అవార్డు అందజేస్తున్న ఎంపీ సత్యవతి

నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లికి చెందిన 18 నెలల బాబుకి నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. నక్కపల్లి కి చెందిన కోసూరి దుర్గా ప్రసాద్, గౌతమి దంపతులకు 18 నెలల బాబు ఈశ్వర్‌కు ఈ అవకాశం లభించింది. మానవ శరీరంలో అవయవాలను ఈ బాలుడు గుర్తించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం నోబుల్ వరల్డ్స్ రికార్డ్ ను అందజేసింది. ఈ మేరకు అనకాపల్లిలో బుధవారం ఎంపీ సత్యవతి చేతుల మీదుగా నోబుల్ వరల్డ్స్ రికార్డ్ జ్ఞాపిక, సర్టిఫికెట్ ను బాలుడు ఈశ్వర తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పారావు

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు

ప్రజాశక్తి -కోటవురట్ల:మార్చి నెలలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు కోరారు. బుధవారం ఆయన మండలంలో జిల్లా పరిషత్తు బాలికల పాఠశాలలో విద్యార్థులు నిర్వహినించిన ఫేర్వెల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 18 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు గాను జిల్లా వ్యాప్తంగా 397 పాఠశాలల్లో 21259 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ సాధించి ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టౌన్ సిఐ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఇటీవల నర్సీపట్నం టౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన కాంతికుమార్ బుధవారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం పట్టణంలోని శాంతి భద్రతలు, ట్రాఫిక్ తదితర అంశాలపై కొద్ది సేపు చర్చించారు.

మొక్కను ఇస్తున్న సిఐ

తహశీల్దార్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి-మాడుగుల: ఇటీవల నియమితులైన మండల తహసిల్దార్‌గా సత్యనారాయణను జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో మండల సెక్రెటరీ మంచాల శివ, మాడుగుల టౌన్ ఉప అధ్యక్షులు రాకేటి నూకరాజు, టౌన్ సెక్రెటరీ గళ్ళ గణేష్, టౌన్ జాయింట్ సెక్రెటరీ వేపాడ నాగరాజు ఉన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సిపిఎస్‌ని రద్దు చేయాలని, ఓపిఎస్ పునరుద్ధరించాలని మండల యూటీఎఫ్ కన్వీనర్ ఎ.సాంబమూర్తి ఆధ్వర్యంలో వేములపూడి మెయిన్ స్కూల్, బాలికల హైస్కూల్‌లలో ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ, సిపిఎస్‌ని రద్దు చేయాలని అన్ని పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాలని, అలాంటి వారికి మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయులు ఓటు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సురేష్, నాయుడు, సిపిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో ఈ అంశాన్ని ప్రాధాన్యతాంశంగా చేర్చాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు పి.గాయత్రి కోరారు.. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ సిపిఎస్‌ని రద్దు చేయాలని ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు చిట్టియ్య, సాంబమూర్తి, శోభన్, సంతోష్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్నయుటిఎఫ్ నేతలు

16న జాబ్ మేళా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక ఎంఎల్ఎఎస్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న జరిగే జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. బుధవారం ఈ మేళాకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో 15 కంపెనీలతో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాకు పదవ తరగతి నుండి పీజీ వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొనాలని ఆయన సూచించారు.

రోడ్డు భద్రతపై సభ

ప్రజాశక్తి-పాడేరు:రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక పాడేరు డిపో, ఏపీఎస్ ఆర్టీసీ, అల్లూరి సీతారామరాజు జిల్లా డిపో గ్యారేజీలో ముగింపు సభ బుదవారం నిర్వహించారు. డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ స్టాఫ్, ఆఫీస్ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది సుమారుగా 80 మంది పాల్గొన్నారు. డిపో మేనేజర్ వేదుల శ్రీనివాసు ఆధ్వర్యాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ, డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానంకు చేర్చాలని తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీలోని 9వ వార్డుకు చెందిన రవిచంద్రకు రూ. 9లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రవిచంద్ర రోడ్డు ప్రమాదానికి గురై కాలును పోగొట్టుకున్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి రూ. 9లక్షల మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ చెక్కును స్వయంగా రవిచంద్ర ఇంటికి తీసుకువెళ్లి ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, నాయకులు పాల్గొన్నారు.

గర్నికంలో ఘనంగా తీర్థం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోనీ గర్నికం బలచెంచమ్మ తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలైన మేడివాడ, పొన్నవోలు, అర్జాపురం, రావికమతం, చినపాచీల, గొల్లలపాలెం, అప్పలమ్మపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. విద్యుత్ అలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. పలుగ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది.

ప్రపంచ దేశాల ప్రగతికి సైకాలజీ దోహదం

-ఎన్‌పి వార్షిక సమావేశాల్లో ఐయుపిఎస్ సెక్రటరీ జనరల్ ఆవా థామ్సన్

ప్రజాశక్తి -మధురవాడ : 21వ శతాబ్దపు అత్యంత ఆవశ్యక శాస్త్రంగా గుర్తింపు పొందిన మానసిక శాస్త్రం ప్రపంచదేశాల ప్రగతికి దోహదపడుతోందన్న విషయాన్ని యునెస్కో సైతం గుర్తించిందని ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సైకలాజికల్ సైన్స్ (ఐయుపిఎస్) సెక్రటరీ జనరల్ అవా డి.థామ్సన్ అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ (ఎన్‌పి) 33వవార్షిక సమావేశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానసికశాస్త్రంలో నూతనఅ ంశాలను చేర్చడానికి వివిధ దేశాలలోని మానసిక శాస్త్ర పరిశోధకులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భారత్ సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని మానసిక శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. గీతం వర్సిటీ విసి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధిలో మానసిక శాస్త్రం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. గీతం విశ్వవిద్యాలయంలో అంతర్విభాగ పరిశోధనలను ప్రోత్సహిస్తున్నామన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ అధ్యక్షులు ప్రొఫెసర్ నీనా కొహ్లి మాట్లాడుతూ వివిధరంగాలలో మానసిక శాస్త్రానికి క్రమేపీ ప్రాధాన్యత పెరుగుతోందన్నార. ఈ రంగంలో పరిశోధనలను నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ ప్రోత్సాహిస్తోందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కామయ్య బండి మాట్లాడుతూ మనుషుల ప్రవర్తన, అందులో వస్తున్న మార్పులు, సమాజంపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేయడంలో మానసిక శాస్త్రం దోహదపడుతోందన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ అప్లయిడ్ సైకాలజీ నూతన అధ్యక్షుడు ఎన్. త్రిపాఠి మాట్లాడారు.. సమావేశాల కన్వీనర్, అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. రవిశంకర్ సమావేశాల వివరాలను తెలియజేశారు. సమాజ సుస్థిర అభివృద్ధిలో మానసిక అంశాల పాత్రపై పరిశోధకులు ఈ సమావేశాలలో విస్తృత చర్చలు జరుపుతారన్నారు అలాగే డెవలప్‌మెంట్ సైకాలజీ, సోషల్ సైకాలజీ, కాగ్నిటివ్ సైకాలజీ, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇండియన్ సైకాలజీ, క్లీనికల్, హెల్త్ సైకాలజీ, మిలటరీ సైకాలజీ, జెరోసైకాలజీ, సైబర్ సైకాలజీ అంశాలలో ఈ నెల 16వ తేదీ వరకు ప్రముఖల ప్రసంగాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్ డాక్టర్ నిధిమిశ్రా, ప్రొఫెసర్ నళిని పాల్గొన్నారు. దేశంలోని ఐఐటిలు, ఐఐఎమ్‌లు, కేంద్ర పరిశోధనా సంస్థల నిపుణులు మాజీ వైస్ ఛాన్సలర్లు, మానసిక శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

వార్షిక సమావేశాలను ప్రారంభిస్తున్న ఆవా థామ్సన్